
సాక్షి అనంతపురం
శనివారం । 7 । జూన్ । 2025





## నేడు బక్రీద్

శనివారం బక్రీద్ పండుగకు ముస్లింలు సిద్ధమయ్యారు. ఇప్పటికే మసీదులు, ఈద్గాలలో ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు.



## తేలికపాటి వర్ష సూచన

రాగల ఐదు రోజులు జిల్లాకు తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు ఎం.విజయ శంకరబాబు, జి.నారాయణస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.




జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఉక్కపోత పెరిగింది. గాలివేగం తగ్గింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### ముస్లింలకు అల్లా ఆశీస్సులుండాలి

- బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన అనంత



అనంతపురం కార్పొరేషన్: ముస్లింలకు వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ అని, ఈ పండుగ పర్వదినాన ముస్లింలకు అల్లా ఆశీస్సులుండాలని ఆకాంక్షించారు. బక్రీద్ పర్వదినం రోజున ఖుర్బానీ ఇచ్చే ముస్లింలకు ఎంతో పుణ్యఫలం లభిస్తుందన్నారు. త్యాగం మనిషిని ఉన్నతుడిని చేస్తుందని, దైవ పరీక్షలో కట్టుకున్న భార్యను వదిలి, కన్నకొడుకు ప్రాణాలు బలిచ్చేందుకు సిద్ధపడిన మహనీయుని త్యాగానికి గుర్తుగా ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని జరుపుకుంటారని తెలిపారు.

### కలెక్టర్ బక్రీద్ శుభాకాంక్షలు



అనంతపురం అర్బన్: ముస్లింలకు కలెక్టర్ వినోద్‌కుమార్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్‌ను ఆనందంగా జరుపుకోవాలని, అల్లా కృపతో జిల్లా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

### తాగునీటి సమస్యపై స్పందించరేం?



రాస్తారోకో చేస్తున్న ఎస్సీ కాలనీ మహిళలు

కూడేరు: ముద్దలాపురం ఎస్సీ కాలనీవాసులు తాగునీటి కోసం శుక్రవారం అనంతపురం - బళ్లారి జాతీయరహదారిపై నిరసన చేపట్టారు. సాయంత్రం ఆరు గంటల నుంచి అరగంటపాటు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. పలువురు దళితులు మాట్లాడుతూ పీఏబీఆర్ నుంచి సీపీడబ్ల్యూఎస్ ప్రాజెక్టు ద్వారా సరఫరా కావాల్సిన తాగునీరు తమ కాలనీకి 15 రోజులుగా నిలిచిపోయిందన్నారు. దీనికితోడు పంచాయతీ నీరు కూడా రావడం లేదన్నారు. తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారుల దృష్టికి తీసుకెళ్తే ఏ ఒక్కరూ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో తహసీల్దార్ మహబూబ్ బాషా, సీఐ రాజు వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. మోటార్ల సమస్య వల్ల తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగిందని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. తాత్కాలికంగా ట్యాంకర్‌తో నీరు సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు.

# అంతులేని అరాచకాలు

### అసాంఘిక శక్తులకు అడ్డా ఉమ్మడి జిల్లా

- రాప్తాడు నియోజకవర్గంలో 3 నెలల్లోనే 3 హత్యలు
- తాజాగా రామగిరి మండలంలో దళిత బాలికపై అత్యాచారం
- తాడిపత్రిలో ఐచర్ వాహనంలో బాలికపై యువకుడి అత్యాచారం
- పుట్లూరు మండలం అరకటివేములలో పసికందుపై అత్యాచారయత్నం
- అన్ని కేసుల్లోనూ టీడీపీ కార్యకర్తలే ప్రధాన నిందితులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారు పగ్గాలు చేపట్టాక ఉమ్మడి అనంతపురం జిల్లాలో దారుణాలు జరుగుతున్నాయి. శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయి. హత్యలు, అత్యాచారాలు అలజడి రేపుతున్నాయి. అత్యాచారాల నేపథ్యంలో మహిళలు బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఇక అధికార బలంతో టీడీపీ నాయకులు ప్రత్యర్థులపై విరుచుకుపడుతున్నారు. హత్యలు, అత్యాచారాల ఘటనల్లో ఎక్కువగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే ప్రధాన నిందితులుగా ఉన్నారు.

**హత్యలతో అరాచకం**

రాప్తాడు నియోజకవర్గ టీడీపీ నాయకుల అధికార దాహానికి సామాన్యులు బలవుతున్నారు. ఈ ఏడాది మార్చి 30న లింగమయ్య అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తను కొట్టి చంపారు. ఆ తర్వాత నెల రోజులు గడవక ముందే రాప్తాడు మండల కేంద్రం సమీపంలో నారాయణరెడ్డి, ముత్యాలమ్మ దంపతులను భూతగాదా పేరుతో నరికిచంపారు. దీంతో జిల్లాలో ఒక్కసారిగా ఫ్యాక్షన్ హత్యలు పురుడు పోసుకున్నట్టు అయింది. తాజాగా అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో తనకు ప్రాణహాని ఉందని టీడీపీకే చెందిన సుధాకర్ నాయుడు ఎస్పీకి ఫిర్యాదు చేయడం జిల్లాలో కూటమి పార్టీ అరాచకాలను అంచనా వేయొచ్చు. అసాంఘిక శక్తులకు ఉమ్మడి అనంతపురం జిల్లా అడ్డాగా మారింది.

**అత్యాచారాల పరంపర..**

❐ **2024 జూన్ 24**

అనంతపురం జిల్లా పుట్లూరు మండలం అరకటివేములలో టీడీపీ కార్యకర్త రవితేజ ఓ బాలికను అపహరించి తాడిపత్రి మార్కెట్‌యార్డ్ వద్ద ఐచర్ వాహనంలోకి తీసుకువెళ్లి తన స్నేహితుడు నాగేంద్రతో కలసి అత్యాచారం చేశాడు. బాధిత కుటుంబం ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. ఆ కుటుంబం ఆందోళన చేయడంతో 8 రోజుల తరువాత అంటే జూలై 2న పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ కేసు ఉపసంహరించుకోవాలని బాధితురాలి కుటుంబాన్ని టీడీపీ నేతలు బెదిరించారు.

❐ **2024 అక్టోబర్ 13**

హిందూపురం నియోజకవర్గం నల్లబొమ్మనపల్లిలో అత్తాకోడలిపై సామూహిక అత్యాచారం జరిగింది. నిర్మాణంలో ఉన్న పేపర్‌మిల్లు సెక్యూరిటీగా ఓ కుటుంబం ఉంది. ఈ కుటుంబంలోని ఉన్న అత్తాకోడలును కాళ్లు చేతులూ కట్టేసి నలుగురు వ్యక్తులు అత్యాచారం చేశారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేసి మరీ ఈ ఘాతుకానికి పాల్పడ్డారంటే పరిస్థితి అంచనా వేయొచ్చు.

❐ **2025 ఏప్రిల్ 23**

పుట్లూరు మండలం అరకటివేముల గ్రామానికి చెందిన ప్రసాద్ అనే 50 ఏళ్ల వ్యక్తి మూడేళ్ల బాలికపై అత్యాచారయత్నం చేసినట్లు కేసు నమోదైంది. ఈ కేసులో నిందితుడు ప్రసాద్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ పంపారు.

❐ **2025 మే 5**

పుట్లూరు మండలం మడుగుపల్లిలో 14 ఏళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన 51 ఏళ్ల వ్యక్తి అత్యాచారయత్నం చేశాడు. బాలిక బహిర్భూమికి వెళుతుండగా గమనించిన వెంకటరాయుడు అనే వ్యక్తి అత్యాచారం చేయబోయాడు. పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

❐ **2025 జూన్ 5**

రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో ఓ దళిత బాలికపై 14 మంది యువకులు అత్యాచారం చేశారు. బాలిక గర్భిణి కావడంతో విషయం బయటపడింది. బాలికకు తండ్రి చనిపోవడం, తల్లి మానసికంగా బాగలేకపోవడంతో ఏమీ చేయలేకపోయింది. ఇప్పుడా బాలిక ఆరు నెలల గర్భిణి. నిందితులందరూ టీడీపీ వారే. పరిటాల సునీతకు అనుచరులుగా ఉన్నారు.

## అపార్ ఐడీ అనివార్యం



వర్క్‌షాప్‌కు హాజరైన యూనివర్సిటీలు, ఇంజినీరింగ్ కళాశాలల ప్రతినిధులు

అనంతపురం: ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు దోహదపడినట్లే.. ప్రతి విద్యార్థికీ అపార్ ఐడీ అనివార్యమని డిజిటల్ ఇండియా కార్పొరేషన్ రీజనల్ నోడల్ ఆఫీసర్ రవి పాండ్య అన్నారు. అపార్ ఐడీ రూపకల్పనపై ఉన్నత విద్యామండలి, యూజీసీ సహకారంతో జేఎన్‌టీయూ అనంతపురంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి రీజనల్ నోడల్ ఆఫీసర్ రవి మాట్లాడుతూ విద్యార్థుల సర్టిఫికెట్లు, మార్క్స్ మెమోలు భద్రపరిచేందుకు అపార్ ఐడీ దోహదపడుతుందన్నారు. ఇందులో ఎల్‌కేజీ నుంచి పీహెచ్‌డీ వరకు విద్యార్థికి సంబంధించిన అన్ని రకాల సర్టిఫికెట్లు, స్టడీ, ట్రాన్స్‌ఫర్, మైగ్రేషన్ సర్టిఫికెట్, ప్రొవిజనల్ సర్టిఫికెట్లు ఇలా ఎన్నో రకాల సర్టిఫికెట్లు భద్రపరచుకోవడానికి వీలు పడుతుందన్నారు. రాయలసీమ పరిధిలోని అన్ని యూనివర్సిటీల కోర్డినేటర్లు, జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఉన్న 120 కళాశాలల ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి అధికారులు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ జీడీ రాజేందర్, జేఎన్‌టీయూ అనంతపురం ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ అంకారావు, డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు పాతర

- అనువైన స్థానాల కోసం అడ్డదారులు
- మే 31 నాటికి 40 ఏళ్లు నిండిన వారికి మాత్రమే 'అవివాహిత మహిళ' కేటగిరీ కింద 5 ప్రత్యేక పాయింట్లు
- బదిలీల చట్టానికి తూట్లు పొడుస్తున్న కొందరు మహిళా టీచర్లు
- పెళ్లికాకుంటే చాలు 'అవివాహిత మహిళ' పాయింట్లు
- చిన్న వయసు టీచర్లూ ఈ పాయింట్లు పొందిన వైనం
- ఎస్జీటీ కేటగిరిలోనే 30 మందికి పైగా అక్రమంగా పాయింట్లు



అనంతపురం ఎడ్యుకేషన్: అనువైన స్థానాల కోసం కొందరు టీచర్లు అడ్డదారులు తొక్కుతున్నారు. సమాజానికి మార్గదర్శకంగా ఉండాల్సిన గురువులే వక్రమార్గాన పాయింట్లు పొందాలని చూస్తున్నారు. నిబంధనలకు పాతరేస్తున్నారు. కొందరు అనర్హత కల్గిన మహిళా టీచర్లు 'అవివాహిత మహిళ' కేటగిరీ కింద పాయింట్లు పొందేందుకు ప్రయత్నం చేస్తున్నారు. పెళ్లి కాకుంటే చాలు ఈ పాయింట్లు పొందుతున్నారు. దాదాపు 30 మంది ఎస్జీటీల సీనియార్టీ జాబితాలో ఇలాంటి టీచర్లు ఉండడం విద్యాశాఖలో కలకలం రేపుతోంది. ఎక్కువగా బ్రహ్మసముద్రం, రొళ్ల, డి.హీరేహాళ్, గుమ్మఘట్ట, మడకశిర, రాయదుర్గం, అమడగూరు, కంబదూరు, అగళి, గుడిబండ, కుందుర్పి మండలాల్లో పని చేస్తున్న మహిళా టీచర్లు ఎక్కువగా అక్రమంగా పాయింట్లు పొందేందుకు దరఖాస్తు చేసుకున్నారు. తాత్కాలిక సీనియార్టీ జాబితాను పరిశీలించిన పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. అనర్హుల జాబితాను సోషల్ మీడియా వేదికగా వైరల్ చేస్తున్నారు.

**31 నాటికి 40 ఏళ్లు నిండిన వారే అర్హులు**

బదిలీల చట్టం జీవో 22 ప్రకారం మే 31 నాటికి 40 ఏళ్లు నిండిన వారికి మాత్రమే 'అన్‌మ్యారెడ్ ఉమెన్' (అవివాహిత) కేటగిరీ కింద 5 స్పెషల్ పాయింట్లు పొందేందుకు అర్హులు. ఈలెక్కన 1985 మే 31కి ముందు జన్మించి ఉండాలి. అయితే 1987 నుంచి 1999 మధ్య జన్మించిన వారు దాదాపు 30 మంది దాకా అవివాహిత పాయింట్లు పొందేందుకు దరఖాస్తు చేసుకున్నారు. 26, 27 ఏళ్ల మహిళలు కూడా దరఖాస్తు చేసుకోవడం విశేషం. జీఓలో చాలా స్పష్టంగా ఇచ్చినా కూడా ఇలా దరఖాస్తు చేశారంటే అడ్డదారులోల పాయింట్లు పొందేందుకేనంటూ ఇతర ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. వాటిపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే వారందరికీ ఆ పాయింట్లు తొలగిస్తామని డీఈఓ ప్రసాద్‌బాబు స్పష్టం చేశారు.

**ఎవరు సహకరించారో...**

ఎస్‌ఏ (ఫిజికల్ సైన్స్) బదిలీల్లో భాగంగా సీనియారిటీ లిస్టులో 38వ నంబర్‌లో ఉన్న రాఘవేంద్ర ప్రస్తుతం కళ్యాణదుర్గం మండలం తిమ్మసముద్రం ఎంపీయూపీ పాఠశాలలో పనిచేస్తున్నారు. రీఅపోర్షన్‌లో ఆయన పోస్ట్ పోయింది. ప్రస్తుత స్టేషన్‌లో 2023 నుంచి 2025 వరకు పనిచేశారు. అంతకు మునుపు స్టేషన్‌లో 2017 నుంచి 2023 వరకు పనిచేశారు. ప్రీవియస్ స్టేషన్ పాయింట్లు వాడుకున్నా 17.5055 రావాలి. కానీ 8 ఏళ్ల పని చేసినట్లు 24 పాయింట్లు వేసుకున్నారు. ఈ విషయం గ్రీవెన్స్ సమయంలో ఎంఈఓకు కొందరు ఫిర్యాదు చేశారు. ఎంఈఓ స్వయంగా డీఈఓ కార్యాలయానికికి వెళ్లి 24 పాయింట్లు తొలగించి 17.5055 మా పాయింట్లు వేయించారు. ఆ తర్వాత ఏమి జరిగిందో.. ఎవరు సహకరించారో తెలీదు కానీ 24 పాయింట్లు వేసుకున్నారు. ప్రస్తుత కౌన్సెలింగ్‌లో కాలువపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు వచ్చారు. ఈయనకంటే ఎక్కువపాయింట్లు ఉన్న టీచర్లకు అన్యాయం జరిగింది. ఈ వ్యవహారంపై ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పాతిరెడ్డి డీఈఓకు ఫిర్యాదు చేశారు.

# అర్ధరాత్రి దాకా పదోన్నతుల కౌన్సెలింగ్



శారదా స్కూల్ ఆవరణలో రాత్రి 11 గంటల సమయంలో ఎదురు చూస్తున్న టీచర్లు



అరుగుపైనే దరఖాస్తులు పూరిస్తున్న ఉపాధ్యాయులు

- మున్సిపల్, కార్పొరేషన్ టీచర్లకు కేఎస్‌ఆర్ స్కూల్‌లో కౌన్సెలింగ్
- జిల్లాపరిషత్, ప్రభుత్వ పాఠశాలల టీచర్లకు శారదా స్కూల్‌లో..
- పర్యవేక్షించిన పాఠశాల విద్య ఆర్జేడీ

అనంతపురం ఎడ్యుకేషన్: ఎస్జీటీ కేడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ కేడర్లకు పదోన్నతులు కల్పించేందుకు శుక్రవారం అనంతపురంలో నిర్వహించిన కౌన్సెలింగ్ అర్ధరాత్రి దాటేదాకా సాగింది. అన్ని యాజమాన్యాల పరిధిలోని 686 పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్ సాగింది. మున్సిపల్ పాఠశాలల్లో 304 పోస్టులు, మున్సిపల్ కార్పొరేషన్‌లో 52 పోస్టులు, ప్రభుత్వ పాఠశాలల్లో 26, జిల్లా పరిషత్ పాఠశాలల్లో 304 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నారు. మున్సిపల్, కార్పొరేషన్ స్కూళ్లలో పోస్టులకు 1:2, ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పోస్టులకు 1:3 రేషియో ప్రకారం టీచర్లను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. అన్ని యాజమాన్యాల పాఠశాలల్లోనూ పదోన్నతులకు పెద్దగా ఆసక్తి చూపలేదు. సౌకర్యవంతమైన ఖాళీలు లేకపోవడంతో చాలామంది పదోన్నతులు తీసుకోలేదు. మునిసిపల్, కార్పొరేషన్ టీచర్లకు కేఎస్‌ఆర్ స్కూల్‌లో, జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల టీచర్లకు శారదా స్కూల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ కౌన్సెలింగ్‌ను పర్యవేక్షించారు. కౌన్సెలింగ్ హాజరైన టీచర్లతో ఆప్షన్ తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వారందరికీ శనివారం పదోన్నతుల ఉత్తర్వులు జనరేట్ కానున్నాయి. వీరితో పాటు బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లు, పీఎస్‌హెచ్‌ఎంలు (స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లు) అందరూ శుక్రవారం వారి పాత స్కూళ్లలో రిలీవై.. శనివారం ఉదయం కొత్త స్కూళ్లల్లో చేరాల్సి ఉంటుందని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. కాగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్కూల్ అసిస్టెంట్ల బదిలీలకు సంబంధించి శుక్రవారం తెల్లవారుజామున నుంచే ఉత్తర్వులు జనరేట్ అయ్యాయి. ఏ సబ్జెక్టులో ఎంతమంది బదిలీ అయ్యారనే వివరాలను రాత్రి 12 గంటలు దాటినా విద్యాశాఖ అధికారులు ప్రకటించకపోవడం గమనార్హం. దీనిపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

**రోస్టర్ రగడ**

కార్పొరేషన్ పరిధిలోని స్కూళ్లకు స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల విషయంలో అధికారులు రోస్టర్ పాటించడం లేదంటూ రాష్ట్రోపాధ్యాయ సంఘం నాయకులు రగడ చేశారు. రోస్టర్ సక్రమంగా పాటించాలంటూ ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.రామాంజనేయులు డిమాండ్ చేశారు. కేఎస్‌ఆర్ బాలికల పాఠశాలలో జరిగిన కౌన్సెలింగ్‌ను అడ్డుకున్నారు. అక్కడే ఉన్న ఆర్జేడీ... ఈ విషయంపై జేడీ సర్వీసెస్‌తో ఫోన్‌లో మాట్లాడి స్పష్టత ఇచ్చారు. అనంతరం కౌన్సెలింగ్ ప్రారంభమైంది.

**కనీస వసతులు లేక అల్లాడిన టీచర్లు**

సాయంత్రంలోపు కౌన్సెలింగ్ ముగుస్తుందని ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు అర్ధరాత్రి దాటినా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరీ ముఖ్యంగా ఆయా కేంద్రాల్లో కనీసం తాగునీటి వసతి కూడా కల్పించలేదు. పెద సంఖ్యలో వచ్చిన టీచర్లు సరైన వెలుతురు లేక ఇబ్బందులు పడ్డారు. వసతుల కల్పనలో విద్యాశాఖ పూర్తిగా వైఫల్యం చెందిందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడ్డారు.

# మీ ఊరి పక్కనే దాష్టీకం.. కనిపించలేదా?

- పరిటాల సునీతను ప్రశ్నించిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



రాప్తాడురూరల్: 'నీ సొంతూరుకు సమీపంలోనే ఉన్న ఏడుగుర్రాలపల్లిలో బాలికను 14 మంది బ్లాక్‌మేల్ చేసి నెలల తరబడి అత్యాచారం చేసి, గర్భవతిని చేసిన దాష్టీకం దృష్టికి రాలేదా సునీతమ్మా' అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. ఏడుగుర్రాలపల్లి ఘటనపై స్పందించిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఘటన ఆ గ్రామంలో ప్రతి ఇంటికీ తెలిసినా నీ చెవులకు సోకలేదా.. నువ్వేమైనా నిద్రపోతున్నావా అని మండిపడ్డారు. పోలీసులు, ఇంటిలిజెన్స్, స్పెషల్‌బ్రాంచ్ ఏమి చేస్తున్నారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒత్తిళ్లు.. ఆంక్షల తర్వాత వెలుగు చూసిన ఈ ఘటనపై తాము మాట్లాడుతున్నామన్నారు. బాలికకు అన్యాయం చేసిన వారు ఎవ్వరైనా సరే కఠినంగా శిక్షించాలన్నారు. ఒక మహిళగా కనీస స్పందన లేకుండా... 'వైఎస్సార్‌సీపీ నాయకులు బాలిక విషయంలో రాజకీయాలు చేస్తున్నారు' అని సిగ్గు లేకుండా ఎలా మాట్లాడతారని మండిపడ్డారు. నిందితులకు కఠినంగా శిక్ష పడాలంటే మీరు లాయర్లను ఏర్పాటు చేయొద్దని సునీతకు సూచించారు. బాలికకు న్యాయం చేయలేని నీవు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**బయటకు రాని ఘోరాలెన్నో..?**

ఏడుగుర్రాలపల్లి 40 ఏళ్లుగా మీకు రిగ్గింగ్ గ్రామమని ప్రకాష్‌రెడ్డి అన్నారు. అంత ఏకఛత్రాధిపత్యం నడుపుతున్న గ్రామంలో బాలికకు ఇంతటి అన్యాయం జరిగినా మీకు తెలీలేదంటే ఎవరు నమ్ముతారు అని పరిటాల సునీతను ప్రశ్నించారు. రామగిరి మండలంలో తొలి గ్రామం కుంటిమద్దికి రావాలంటేనే పోలీసులు మమ్మల్ని రానివ్వడం లేదన్నారు. పోలేపల్లి గుడికి వెళ్తామంటే అడ్డుకున్నారన్నారు. పరిటాల కుటుంబం ఆధిపత్యం చలాయించే గ్రామాల్లో వెలుగులోకి వచ్చింది ఈ ఘటన ఒక్కటేనన్నారు. బయటకు రాకుండా ఎన్నిఘోరాలు.. నేరాలు జరుగుతున్నాయో అని అనుమానం వ్యక్తం చేశారు. రామగిరి బంగారు గనుల గుంతల్లో వందలాది శవాలున్నాయని గతంలో చెప్పుకునేవారని గుర్తు చేశారు. ఎక్కడెక్కడో చంపి శవాలను అక్కడేశారన్నారు. మీరంటే అలాంటి భయం ఇంకా కొనసాగుతోందన్నారు. అందుకే మాజీ ఎమ్మెల్యే అయిన తనను ఆ మండలంలోకి రానివ్వాలంటే పోలీసులు భయపడుతున్నారన్నారు. అలాంటి మీ కంచుకోటలో అకృత్యం జరిగిందన్నారు. ఒక ఆడబిడ్డకు జరిగిన అన్యాయం గురించి ఒక పత్రిక రాసిందన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా తాను నోరు విప్పి మాట్లాడితే రాజకీయం అంటగడుతున్నావంటే నువ్వు మహిళవేనా అని ప్రశ్నించారు.

# పాదయాత్రకు కలసిరండి

- ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్‌కు సహకరించండి
- అప్పుడే కూటమి నేతల దుర్మార్గాలకు పాపవిముక్తి
- రంగయ్య పాదయాత్రలో మాజీ మంత్రి శైలజానాథ్



కన్నేపల్లిలో రంగయ్యతో కలిసి పాదయాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి శైలజానాథ్, నేతలు

కళ్యాణదుర్గం: అణగారిన వర్గాల అభ్యున్నతి-సంక్షేమం కోసం పాటుపడుతున్న ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ కోసం మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య చేపట్టిన 'సేవ్ ఆర్డీటీ పరిరక్షణ' పాదయాత్రకు కూటమి నాయకులు కలిసిరావాలని మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్ పిలుపునిచ్చారు. అప్పుడే కూటమి నేతల దౌర్జన్యాలు, దుర్మార్గాలకు పాపవిముక్తి కలుగుతుందని వ్యాఖ్యానించారు. శుక్రవారం బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లికి చేరుకున్న పాదయాత్రలో శైలజానాథ్ పాల్గొని మద్దతు తెలిపారు. అనంతరం తలారి రంగయ్యతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్డీటీ సంస్థకు కారణాలు చెప్పకుండా విదేశీ నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపేయడం దారుణమన్నారు. తాము ఆర్డీటీని కాపాడుకునేందుకు, ఇక్కడి ప్రాంత ప్రజల అభ్యున్నతి కోసం పాదయాత్ర చేస్తున్నామని తెలిపారు. కూటమి నేతలు మాత్రం ఆర్డీటీకి నిధులు రాకుండా ఆటంకం కలిగిస్తున్నారన్నారు. తలారి రంగయ్యతో కలిసి నడిస్తే కూటమి నేతలకే మంచిదని హితవు పలికారు. తాము బలాబలాల గురించి గానీ, రాజకీయాల గురించి గానీ మాట్లాడటం లేదని చెప్పారు. పేదలకు విద్య, వైద్యం, వ్యవసాయం, గృహనిర్మాణం, మహిళాభ్యున్నతి, స్వయం ఉపాధి కోసం పాటుపడిన ఆర్డీటీ సంస్థ సేవలు మరింతకాలం కొనసాగడం కోసం తాము పోరాటం చేస్తున్నామని తెలిపారు. కూటమి నేతలు చిత్తశుద్ధితో ఆర్డీటీ తరఫున నిలబడితే జిల్లాలోని 14 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు ప్రభుత్వ సొమ్ముతో ఢిల్లీకి వెళ్లి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ ఉత్తర్వులు తీసుకురావాలని సూచించారు.

**పాదయాత్ర చేస్తే రోడ్లు సమసిపోతాయా..?**

ఆర్డీటీ పరిరక్షణ కోసం తలారి రంగయ్య ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రను అడ్డుకోవాలని చూడటాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ తప్పుపట్టారు. పాదయాత్ర చేస్తే గతుకుల రోడ్ల దుస్థితి బయటపడుతుందని కూటమి నేతలకు భయం పట్టుకుందన్నారు. 'సేవ్ ఆర్డీటీ' పాదయాత్రకు వైఎస్సార్‌సీపీ సంపూర్ణ సహకారం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, నాయకుడు మాదినేని ఉమా మహేశ్వరనాయుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, అనంతపురం డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గంగాధరప్ప, పార్టీ వివిధ విభాగాల రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా అడ్డగింత



ట్రాక్టర్, జేసీబీని నిలిపివేసిన గ్రామస్తులు

శింగనమల: నిదనవాడ సమీపంలోని పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి టీడీపీ నాయకులు అక్రమంగా ఇసుక తవ్వి తరలిస్తుండగా గ్రామస్తులు శుక్రవారం అడ్డుకున్నారు. వారం రోజులుగా జేసీబీతో తవ్వి ట్రాక్టర్లతో బయటకు తరలించి డంప్ చేసి, అక్కడి నుంచి టిప్పర్లతో ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. అధికారులకు విషయం తెలిపినా పట్టించుకోలేదు. దీంతో గ్రామస్తులు పార్టీలకు అతీతంగా కదిలి ఇసుక అక్రమ తరలింపును అడ్డుకున్నారు. టిప్పరు, జేసీబీ, ట్రాక్టరును పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

- ఇదిలా ఉండగా.. కూటమి అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకులు మండలంలో దాదాపు రూ.2 కోట్లు విలువ చేసే ఇసుకను అక్రమంగా తరలించారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

## క్లుప్తంగా

### కామాంధులను కఠినంగా శిక్షించాలి

- ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్

**అనంతపురం టవర్‌క్లాక్:** దళిత బాలికను గర్భవతిని చేసిన కామాంధులను కఠినంగా శిక్షించాలని ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామగిరి మండలానికి చెందిన దళిత మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన కొందరు యువకులు 6 నెలల పాటు బెదిరించి అత్యాచారం చేస్తూ వచ్చారన్నారు. ఫలితంగా ఆ చిన్నారి గర్భవతి అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు విద్యార్థినిపై సాముహిక అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలన్నారు.

### యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

**అనంతపురం రూరల్:** యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. ఈ నెల 8 న శిల్పారామంలో జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో అక్కడ చేపట్టిన ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. శిల్పారామం పరిసరాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి పాల్గొన్నారు.

### బక్రీద్ సందర్భంగా పటిష్ట భద్రత

**అనంతపురం:** బక్రీద్ సందర్భంగా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న మసీదులు, మదరసాలు, ఈద్గాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. సున్నిత ప్రదేశాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. బీట్లు, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ సహా ఏదైనా సోషల్ మీడియాల్లో అభ్యంతకరమైన పోస్టులు షేర్ చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌ను సులభతరం చేయాలన్నారు. త్యాగానికి, సహనానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ పండుగను శాంతి సామరస్యాలు వెల్లివిరిసేలా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ జిల్లాలోని ముస్లింలకు ఎస్పీ పి. జగదీష్ శుభాకాంక్షలు తెలిపారు.

# నష్టపోయిన రైతులను ఆదుకోండి

- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో సభ్యుల డిమాండ్
- అరటి, మామిడి రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని సూచన
- చెట్లు కూలిపోతేనే పరిహారం చెల్లిస్తామని అధికారి వివరణ



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ. చిత్రంలో వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, సీఈఓ వెంకటసుబ్బయ్య

**అనంతపురం సిటీ:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అరటి, మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారని, బాధిత రైతులను నష్ట పరిహారం అందించి అన్ని విధాల ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని జెడ్పీటీసీ సభ్యులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు స్పందిస్తూ.. పూత, పిందే దశలో ఉన్న వాటికి పరిహారం వర్తించదని, చెట్లు పూర్తిగా నేలమట్టమైతేనే పరిహారం చెల్లిస్తామని చెప్పడంతో సభ్యులు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉభయ జిల్లా స్థాయీ సంఘం–1, 2, 3, 4, 5, 6, 7 సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో శుక్రవారం జరిగింది. సీఈఓ వెంకటసుబ్బయ్య, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, గుమ్మఘట్ట జెడ్పీటీసీ సభ్యుడు మహేష్, ఉరవకొండ జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతమ్మ వేదికపై ఆశీనులయ్యారు. తొలుత వ్యవసాయ శాఖపై చర్చ సందర్భంగా మామిడి, అరటి రైతులను ఆదుకోవాలనే అంశంపై గోరంట్ల, ఓబుళదేవరచెరువు జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాం నాయక్, దామోదర్ రెడ్డి మాట్లాడారు. భారీ వర్షాలతో నష్టపోయిన ఉద్యాన రైతులను ఏ విధంగా ఆదుకుంటారో తెలపాలని పట్టుబట్టారు. జెడ్పీ చైర్‌పర్సన్ జోక్యం చేసుకుంటూ ఎన్ని హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి, ఎన్ని చెట్లు కూలిపోయాయ్, ఎంత మంది రైతులు నష్టపోయారో వివరాలు వెల్లడించాలని సూచించారు. అయితే ఉద్యాన శాఖ అధికారి వద్ద కనీస సమాచారం లేకపోగా, పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో సభ్యులు మండిపడ్డారు. చెట్లు కూలిపోతేనే పరిహారం ఇస్తామని చెప్పడంతో .. అంతెందుకు రైతులు చస్తేనే పరిహారం ఇస్తామని ప్రకటించండంటూ ఆవేశంతో ఊగిపోయారు. రైతులకు నాణ్యమైన కందులు సరఫరా చేయాలని గుమ్మఘట్ట జెడ్పీటీసీ మహేష్, ఓడీచెరువు జెడ్పీటీసీ దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏయే పంటలు సాగు చేయాలో రైతులకు అవగాహన కల్పించాలని నల్లమాడ జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి కోరారు. రైతు భరోసా కేంద్రాలను ఎందుకు నిర్వీర్యం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### జీజీహెచ్ సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోండి

స్థాయీ సంఘ సమావేశానికి దుమ్మా కొట్టిన ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు చర్యలు తీసుకోవాలంటూ సభ్యులు డిమాండ్ చేశారు. ఓబుళదేవరచెరువు పీహెచ్‌సీ కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని, అయినా అదే పాడుబడిన భవనంలో వైద్య సేవలు అందిస్తుండడంపై జెడ్పీటీసీ దాము ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై జెడ్పీ చైర్‌పర్సన్ కల్పించుకుంటూ.. పరిస్థితిని ప్రభుత్వానికి వివరించి, కొత్త భవనాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా డీఎంహెచ్‌ఓను ఆదేశించారు.

### పోషణ్ పక్వాడా నిధుల స్వాహాపై చర్యలేవీ?

పోషణ్ పక్వాడా నిర్వహణకు సంబంధించి ఒక్కో జిల్లాకు రూ.5 లక్షలు చొప్పున ఉమ్మడి జిల్లాకు రూ.10 లక్షలు మంజూరయ్యాయని, వీటిని సీడీపీఓలు నొక్కేసి తూతూ మంత్రంగా ముగించారని నార్పల జెడ్పీటీసీ నాగరత్నమ్మ, గోరంట్ల జెడ్పీటీసీ జయరాం నాయక్ ఆరోపించారు. ఆ భారమంతా సూపర్‌వైజర్ల మీద పడిందన్నారు. సీడీపీఓలపై చర్యలు తీసుకొని ప్రభుత్వం ఇచ్చిన డబ్బును సూపర్‌వైజర్లకు పంచాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ పీడీ నాగమణి స్పందిస్తూ.. వచ్చిన డబ్బును సీడీపీఓల ఖాతాల్లో జమ చేశామని ఆధారాలు చూపారు. అయితే వాళ్లు దిగమింగిన సంగతి తనకు తెలియదని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### పేద విద్యార్థులకు న్యాయం చేయండి

జిల్లాలోని అంబేడ్కర్, ఇతర గురుకుల పాఠశాలల్లో గతంలో సీట్లు అమ్ముకున్నారని, ఈసారి ఆ పరిస్థితి లేకుండా పేద విద్యార్థులకు న్యాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ నాగరత్నమ్మ కోరారు. హాస్టళ్లలో పరిస్థితులు మెరుగుపడేలా చూడాలన్నారు. సీట్లు కావాలని ఓట్లేసిన ప్రజలు ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తుంటారని, అలాంటప్పుడు వారు సిఫారసు చేస్తే కచ్చితంగా కొన్ని సీట్లు ఇచ్చేలా చూడాలని జెడ్పీ చైర్‌పర్సన్ సూచించారు.

### తగ్గుతున్న భూగర్భ జలాలు

**అనంతపురం అగ్రికల్చర్:** చాలా ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గుతున్నట్లు ఆ శాఖ తాజాగా నివేదిక విడుదల చేసింది. నీటిమట్టం కొలిచేందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న బోర్లకు అనుసంధానం చేసిన 97 ఫిజోమీటర్ల నుంచి తాజాగా సేకరించిన గణాంకాల ప్రకారం సగటు నీటి మట్టం 11.42 మీటర్లుగా నమోదైంది. ఇందులో 47 ఫిజోమీటర్లలో నీటిమట్టం స్వల్పంగా క్షీణిస్తున్నట్లు, మిగిలిన 50 ఫిజోమీటర్లలో భూగర్భ జలాలు నిలకడగానే ఉన్నట్లు గుర్తించారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ 509.3 మి.మీ గానూ 49.2 మి.మీ అధికంగా 759.6 మి.మీ వర్షపాతం కురిసినా భూగర్భజలాలు అనుకున్న స్థాయిలో పెరగకపోవడం గమనార్హం. బెళుగుప్ప, బ్రహ్మసముద్రం, డి.హీరేహాళ్, గుత్తి, గుమ్మఘట్ట, కళ్యాణదుర్గం, కంబదూరు, కణేకల్లు, కూడేరు, కుందుర్పి, పామిడి, పుట్లూరు, శెట్టూరు, తాడిపత్రి, యాడికి మండలాల్లోని చాలా ఫిజోమీటర్లలో నీటిమట్టం తగ్గుదలను గుర్తించారు. యాడికి మండలం రాయలచెరువులో ఉన్న ఫిజోమీటర్‌లో 40.06 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు వెళ్లాయి. అలాగే పుట్లూరు ఫిజోమీటర్‌లో 35.37 మీటర్లు, యాడికి మండలం నగరూరులో 33.46 మీటర్లు... ఇలా చాలా ఫిజోమీటర్లలో నీటి మట్టం తగ్గుతున్నట్లు వెల్లడైంది. విపరీతమైన నీటి వాడకం ఉన్న నార్పల మండలాన్ని 'డేంజర్ జోన్'లో పెట్టారు. కాగా, జిల్లా వ్యాప్తంగా 1,87,610 బోరుబావులు పనిచేస్తుండగా... 13 గ్రామాల్లో వాల్టా చట్టం అమలు చేస్తున్నట్లు భూగర్భ జలవనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.తిప్పేస్వామి తెలిపారు.

# చింతకుంట మధుపై దాడి

- టీడీపీ నేతలపై పోలీసులకు ఫిర్యాదు



ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్తున్న మేయర్ వసీం, నాయకులు అనంత చంద్రారెడ్డి, తదితరులు

**అనంతపురం:** వైఎస్సార్‌సీపీ నేత చింతకుంట మధుపై టీడీపీ నేతలు మూకుమ్మడిగా దాడి చేశారు. బాధితుడు తెలిపిన మేరకు... నగరంలోని 39వ డివిజన్ పరిధిలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మేయర్ వసీంతో పాటు కార్పొరేటర్లు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. మేయర్ మొక్కలు నాటి వెళ్లిన అనంతరం కార్పొరేటర్ చింతకుంట సుశీలమ్మ కుమారుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు వద్దకు స్థానిక టీడీపీ నేతలు మోహన్ కుమార్, అఖిల్, ఏఆర్ కానిస్టేబుల్ నరేంద్రతో పాటు మరో పది మంది వచ్చి వాదనకు దిగారు. ఆగ్రహంతో ఊగిపోతూ మధును చుట్టుముట్టి విచక్షణారహితంగా దాడిచేశారు. అక్కడే ఉన్న సచివాలయ ఉద్యోగులను సైతం దూషించారు. కూటమి ప్రభుత్వంలో నిర్వహించే అధికారిక కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ వారు ఎలా పాల్గొంటారు.. వారిని ఎలా మీరు రానిస్తారు అంటూ రెచ్చిపోయారు.

#### దాడి హేయం

చింతకుంట మధుపై టీడీపీ నేతలు దాడి చేయడం హేయమని మేయర్ వసీం ఖండించారు. దాడి విషయం తెలుసుకున్న మేయర్‌తో పాటు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, బాధితుడు చింతకుంట మధుతో కలిసి నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. సీఐకి ఫోన్ చేస్తే తాను సెలవులో ఉన్నానని చెప్పారు. ఎస్ఐ వద్దకు వెళ్తే ఆయన ఆ సమయంలో భోజనం చేస్తున్నారు. దాదాపు గంట సేపటి తర్వాత బాధితుడి నుంచి ఫిర్యాదు స్వీకరించారు. అనంతరం మేయర్ విలేకరులతో మాట్లాడారు. ఫిర్యాదు తీసుకోవడానికి ఇబ్బంది పడేటప్పుడు.. ఉద్యోగం ఎందుకు చేయాలని ప్రశ్నించారు. గత ఐదేళ్ల పాలనలో అప్పటి అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఏనాడూ కబ్జాలు, దౌర్జన్యాలను ప్రోత్సహించలేదన్నారు. నేడు కూటమి పాలనలో నగరంలో అరాచకాలు అధికమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత మూడు రోజులుగా పత్రికల్లో వస్తున్న వార్తలే ఇందుకు నిదర్శనమన్నారు. ఇటీవల తన చాంబర్‌లోకి సైతం టీడీపీ నేతలు దౌర్జన్యంగా ప్రవేశిస్తే ఎస్పీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. నాడు ఎస్పీ కఠినంగా వ్యవహరించి ఉంటే నేడు ఇలాంటి ఘటనలు జరిగి ఉండేవి కాదన్నారు. చింతకుంట మధుపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్ర, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులేసు, యువజన విభాగం స్పోక్స్‌పర్సన్ మారుతీ నాయుడు, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దాదా ఖలందర్, ఎస్సీ సెల్ జిల్లా జనరల్ సెక్రెటరీ కుళ్లాయి స్వామి, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాకే శ్రీనివాసులు, టౌన్ సెక్రెటరీ సురేంద్ర రెడ్డి, కార్పొరేటర్స్ సంపంగి రామాంజినేయులు, కమల్, మైనార్టీ నాయకులు రఫీ, వైసీపీ నాయకులు అనిల్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### విత్తన నాణ్యతతోనే అధిక దిగుబడులు

- భారత నూనె గింజల పరిశోధనా స్థానం డైరెక్టర్ మాథూర్



మాట్లాడుతున్న ఐఐఓఆర్ డైరెక్టర్ మాథూర్

**కూడేరు:** పంటల సాగులో విత్తనం నాణ్యతగా ఉంటేనే అధిక దిగుబడులు సాధించడానికి అవకాశముంటుందని భారత నూనె గింజల పరిశోధనా స్థానం (ఐఐఓఆర్) డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కే మాథూర్ అన్నారు. 'వికసిత్ కృషి సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని భారతీయ నూనె గింజల ప్రాంతీయ పరిశోధన స్థానం, రేకులకుంట, కదిరి, కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం, మండల వ్యవసాయ శాఖ సంయుక్తంగా కూడేరు మండలం పి.నారాయణపురం గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. శాస్త్రవేత్తలు డాక్టర్ మంజునాథ్, డాక్టర్ సతీష్, డాక్టర్ విజయ శంకర్, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ చెన్నరాయుడు మాట్లాడుతూ.. యాజమాన్య పద్ధతుల్లో ఆముదం పంట సాగు చేస్తే లాభాలు ఉంటాయన్నారు. అనంతరం కలగళ్ల, ఇప్పేరు, పి.నారాయణపురం రైతులకు 4 కిలోల చొప్పున ఐసీహెచ్–5 రకం ఆముద విత్తనాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ హనుమంతరెడ్డి, ఏఓ విజయకుమార్, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

### రైలు ఎక్కబోతూ కిందపడి వృద్ధుడి మృతి



ప్రమాదానికి ముందు రైల్వే స్టేషన్‌లో సంజీవరాయుడు

**అనంతపురం సిటీ:** స్థానిక రైల్వే స్టేషన్‌లో కదిలుతున్న రైలు ఎక్కబోయి కింద పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. జీఆర్‌పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు.. వైఎస్సార్ కడప జిల్లా యర్రగుంట్లకు చెందిన దూదేకుల సంజీవరాయుడు(60)కు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. యర్రగుంట్లలోని చిన్న కొడుకు వద్ద ఉంటున్న రాయుడు హోటల్‌లో పని చేసుకుంటూ కాలం వెళ్లదీసేవాడు. గురువారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకోవడంతో కుమారుడు మందలించాడు. మనస్తాపానికి గురైన రాయుడు రాత్రికి ఇంటి నుంచి వచ్చేసి యర్రగుంట్ల రైల్వే స్టేషన్‌లోనే పడుకున్నాడు. శుక్రవారం ఉదయమే మచిలీపట్నం–ధర్మవరం రైలెక్కి అనంతపురానికి చేరుకుని నీళ్ల కోసమని దిగాడు. అదే సమయంలో రైలు కదులుతుండడం చూసి ఎక్కేందుకు ప్రయత్నించాడు. అయితే అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రంగా గాయపడిన ఆయనను 108 వాహనంలో సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మరణించాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

### రోగులతో ఆత్మీయంగా మాట్లాడాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

**అనంతపురం అర్బన్:** రోగులతో ఆత్మీయంగా మాట్లాడితే.. అదే వారి వ్యాధిని సగం తగ్గించేస్తుందని కలెక్టర్ వినోద్‌కుమార్ వైద్యులకు సూచించారు. దేవునిగా భావించే వైద్యుల మాటకు అంత శక్తి ఉంటుందని పేర్కొన్నారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, ఎన్టీఆర్ వైద్యసేవ ఆస్పత్రుల వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది ప్రొఫెషనల్‌గా ఉండాలన్నారు. రోగులను స్నేహభావంతో పలకరించాలని చెప్పారు. ఆస్పత్రి సిబ్బందికి ఈ విషయాన్ని చెప్పాలన్నారు. ఫార్మసిస్టులు ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించే వైద్యసేవల మీద ఆర్‌టీజీఎస్ ద్వారా ప్రజల నుంచి ప్రభుత్వం ఫీడ్‌బ్యాక్ తీసుకుంటోందన్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని తనిఖీ చేస్తాన్నారు. వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ రోగులతో వ్యవహరించే తీరు మెరుగుపరచుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో–ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.



### సీపీఆర్‌తో ప్రాణం నిలిపారు!



బాధిత విద్యార్థికి సీపీఆర్ చేస్తున్న కానిస్టేబుల్ దేవేంద్ర



చికిత్స పొందుతున్న నరసింహులు

**కదిరి టౌన్:** కరెంటు షాక్‌కు గురైన విద్యార్థి చనిపోయాడని అందరూ అనుకున్నారు. కుటుంబ సభ్యుల రోదనలు కూడా మిన్నంటాయి. అదే సమయంలో అక్కడే ఉన్న కానిస్టేబుల్ దేవేంద్ర సీపీఆర్ చేసి విద్యార్థి ప్రాణాలు నిలిపారు. ఈ ఘటన కదిరి పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు... పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ సమీపంలో నూతనంగా గృహ నిర్మాణాన్ని స్థానికుడు ఆంజనేయులు చేపట్టాడు. ఆయన కుమారుడు నరసింహులు శుక్రవారం ఇంటిపైకి ఎక్కిన సమయంలో పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ లైనును ప్రమాదవశాత్తు తాకడంతో షాక్‌కు గురయ్యాడు. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతను మృతి చెందాడని భావించిన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. విషయం తెలుసుకున్న కానిస్టేబుల్ దేవేంద్ర వెంటనే సీపీఆర్ చేయడంతో ప్రాణాలు నిలిచాయి. తర్వాత బాలుణ్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. కాగా, విద్యార్థి నరసింహులు పట్టణంలోని ఓ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు.

### కో–ఆపరేటివ్ డిప్లొమా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

**అనంతపురం అగ్రికల్చర్:** రాష్ట్ర సహకార యూనియన్ ఆధ్వర్యంలో డిప్లొమా ఇన్ కో–ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (డీసీఎం, సీఏ) కోర్సు ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు అనంతపురంలోని రాయలసీమ సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపికైనా అభ్యర్థులకు 10వ బ్యాచ్ కింద 24 వారాలు శిక్షణ ఉంటుంది. సహకార సంస్థలు, సంఘాల్లో పనిచేయాలనుకున్న వారు ఈ కోర్సు తప్పని సరిగా పూర్తి చేసి ఉండాలి. 10వ తరగతి ఉత్తీర్ణత, ఇంటర్.. సమాన అర్హత కలిగిన వారు అర్హులు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 29వ తేదీలోపు స్థానిక రామ్‌నగర్‌లో ఉన్న శిక్షణా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు 94907 41137లో సంప్రదించవచ్చు.

### 8న డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష

**అనంతపురం:** ఎస్కేయూ పరిధిలో డిగ్రీ ఐదో సెమిస్టర్‌లో ఒక సబ్జెక్టు ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈ నెల 8న అనంతపురంలోని కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుంది. ఇప్పటి వరకూ పరీక్ష ఫీజు చెల్లించని వారు రూ.2,200 చలానా, పాత హాల్‌టికెట్ తీసుకుని పరీక్ష కేంద్రానికి నేరుగా హాజరు కావచ్చు. ఈ అంశంపై పూర్తి వివరాలను ఆయా కళాశాల ప్రిన్సిపాళ్లను అడిగి తెలుసుకోవచ్చు. కాగా, హిందూపురంలోని ఓ పరీక్ష కేంద్రంలో ఎస్కేయూ యూజీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడిన ఓ విద్యార్థిని డీబార్ చేసినట్లు ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు.

### మాజీ సైనికుడి భూమికే ఎసరు

**కళ్యాణదుర్గం రూరల్:** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెవెన్యూ అధికారుల ధన దాహానికి అడ్డూ అదుపులేకుండా పోయింది. కాసుల కక్కుర్తితో పడి మధ్యవర్తులతో చేతులు కలిపి మాజీ సైనికుడి భూమికే ఎసరు పెట్టారు. వివరాలు.. బెళుగుప్ప మండలం కాలువపల్లికి చెందిన హనుమంతు 17 ఏళ్ల పాటు భారత పదాతిదళంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. 2012లో అప్పటి ప్రభుత్వం ఆయనకు బెళుగుప్ప మండలం నరసాపురం గ్రామ పంచాయతీలోని ఎలువలంక తండా పరిధిలో సర్వే నంబర్ 331–1లో ఐదు ఎకరాల భూమికి పట్టాను మంజూరు చేసింది. అప్పటి నుంచి ఆ భూమిలో వివిధ రకాల పంటలను ఆయన సాగు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి బ్యాంక్‌లో పంట రుణాలు సైతం పొందారు. 2016వరకు ఆన్‌లైన్‌లో ఉన్న భూమిని రెవెన్యూ అధికారులు భారీ ముడుపులు దండుకుని మరో వ్యక్తి పేరున బదలాయించారు. విషయం తెలుసుకున్న హనుమంతు నేరుగా రెవెన్య అధికారులను సంప్రదించారు. అయినా ఫలితం లేకపోయింది. దాదాపు తొమ్మిదేళ్ల పాటు కలెక్టరేట్, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఏ ఒక్కరూ స్పందించలేదు. చివరకు ఓ రెవెన్యూ అధికారి కల్పించుకుని ఎక్కడికెళ్లిన పని పూర్తి కాదని, తాను అడిగినంత చెల్లిస్తే వెంటనే పని పూర్తి చేస్తానని నమ్మబలికాడు. దీంతో రెవెన్యూ అధికారుల అంతరంగాన్ని పసిగట్టిన మాజీ సైనికుడు హనుమంతు శుక్రవారం ఆర్డీఓ వసంతబాబును కలసి తన సమస్య వివరించారు. తనకు న్యాయం చేయాలంటూ అర్జీ అందజేసి, కన్నీటితో వేడుకున్నారు.

## క్లుప్తంగా

### బక్రీద్ శుభాకాంక్షలు

• మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



**ఆత్మకూరు:** త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీక బక్రీద్ అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ముస్లింలకు శుక్రవారం ఓ ప్రకటనలో బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దేవుడి దయతో ప్రజలందరూ ఆరోగ్యాలు, సుఖ సంతోషాలు జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ అల్లాహ్ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు.

### యోగాతో ఆరోగ్యం



యోగా సాధన చేస్తున్న కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ కమిషనర్ పావని

**అనంతపురం కార్పొరేషన్:** యోగాతో ఆరోగ్యం లభిస్తుందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి, కమిషనర్ బాలస్వామి పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరపాలక సంస్థ ఎదుట ఉద్యోగులకు యోగాపై శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. డీఎంహెచ్ఓ, కమిషనర్ మాట్లాడుతూ.. రోజూ అరగంట పాటు యోగా సాధన చేయాలన్నారు. మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ధృఢత్వం లభిస్తుందని తెలిపారు. ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అందరూ పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పావని, ఆయుష్ శాఖ వైద్యులు డాక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### పొగాకు విక్రయాలు నిషేధం

**అనంతపురం క్రైం:** ఆర్టీసీ బస్టాండ్, స్కూళ్లు, దేవాలయాలు, ఆస్పత్రులకు 100 గజాల దూరం వరకు ఎక్కడా పొగాకు విక్రయాలు జరగకుండా నిషేధం విధించినట్లు జిల్లా వైద్యాధికారులు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. పొగాకు వినియోగం ద్వారా కలిగే నష్టాలను వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా పొగాకు నియంత్రణ పర్యవేక్షణాధికారి డా.జి నారాయణస్వామి తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే రూ.200 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పొగాకు, వాటి ఉత్పత్తుల వినియోగంతో వారి ఆరోగ్యంతో పాటు వారిపై ఆధారపడిన వారు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం, స్టేషన్ మేనేజరు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### డాక్టర్ ఐజయ్య సేవలు అభినందనీయం



సీఎస్ఐ చర్చిలో డాక్టర్ ఐజయ్యను సత్కరిస్తున్న దృశ్యం

**అనంతపురం కల్చరల్:** దశాబ్దాలుగా క్రైస్తవులను ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తూ రెవరెండ్ ఐజయ్య అందిస్తున్న సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. శుక్రవారం అరవింద నగర్‌లోని సీఎస్ఐ చర్చిలో 60 ఏళ్ల సేవా జీవితం పూర్తయిన సందర్భంగా డాక్టర్ ఐజయ్యకు ఆత్మీయ సన్మానం జరిగింది. చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా రాయలసీమ డియోసీస్ బిషప్ రెవరెండ్ డాక్టర్ పెయ్యాల వరప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఐజయ్య సేవలను కొనియాడారు. అంతకు ముందు సంఘ కాపరి డాక్టర్ బెన్హర్‌బాబు ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. కార్యక్రమంలో పాస్టర్లు రాజేష్, థామస్, విజయ్ కుమార్, జాన్‌స్యామ్, బ్రిజేష్ తిమోతి, సురేష్ పీటర్, రాబర్ట్, ఆదినారాయణ, జయరాజ్, సుధాకర్, అనిల్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న ఇంటర్నల్ కమిటీ అధ్యక్షురాలు డాక్టర్ హేమలత

**అనంతపురం మెడికల్:** లైంగిక వేధింపులకు పాల్పడితే ధైర్యంగా తెలియజేయాలి. ఎవరైనా అటువంటి దుశ్చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ ఆర్ఎంఓ, పోష్ ఆక్ట్ 13కు సంబంధించి ఇంటర్నల్ కమిటీ అధ్యక్షురాలు డాక్టర్ హేమలత పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పోష్ యాక్ట్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మహిళల భద్రతకు సంబంధించి పోష్ యాక్ట్ పనితీరు, తదితర విషయాలను విపులంగా తెలియజేశారు. అనంతరం ఇంటర్నల్ కమిటీ అధ్యక్షురాలిగా డాక్టర్ హేమలత, సభ్యులుగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షబానా(గైనకాలజీ), గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి, సీనియర్ న్యాయవాది మల్లెల శశికళ నియమితులయ్యారు. ఇక నుంచి ఆస్పత్రిలో విధులు నిర్వర్తించే మహిళా ఉద్యోగులు, వైద్యులు, స్టాఫ్ నర్సులు, హౌస్‌సర్జన్లు, ఎఫ్ఎన్ఓలు, క్లాస్-4 ఉద్యోగులు ఏమైనా సమస్యలుంటే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## బిల్లుల కోసం బరి తెగింపు



అంగన్‌వాడీ కేంద్రం పక్కనే నిర్మించిన పశువుల నీటి తొట్టి

రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రం-2 పక్కనే ఉపాధి హామీ పథకం ద్వారా పశువుల నీటి తొట్టెను నిర్మించారు. వాస్తవంగా పశువులు సంచరించే ప్రాంతాల్లో నీటి తొట్టెలు నిర్మించాలి. అయితే ఇక్కడ టీడీపీ నాయకులు బిల్లుల కోసం అంగన్‌వాడీ కేంద్రం పక్కన నీటి తొట్టెను నిర్మించి, చేతులు దులుపుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం పక్కనే నీటి తొట్టెను నిర్మించడంతో చిన్నారులు నీటి తొట్టెలో పడి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. నీటి తొట్టెను మరొక ప్రాంతంలో నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి తొట్టెను మరొక ప్రాంతంలో నిర్మించాల్సిన అవసరం ఉంది. – రాప్తాడు:

## ముందుకు కదలని మురుగు

రాప్తాడు మండలం పాలచెర్ల గ్రామంలో సీసీ రోడ్డు పక్కనే మురుగు నిలవడంతో దుర్వాసన వస్తోంది. సీసీ రోడ్డు పక్కనే వీధి కుళాయి ఉండటంతో కొంత మంది రోజూ అక్కడే బట్టలు ఉతకడం వల్ల మురుగు నిలబడుతోంది. దోమలు వ్యాప్తి చెంది విష జ్వరాలు సోకే అవకాశం ఉంది. కొన్ని నెలలుగా మురుగు నిల్వ ఉండటంతో పాచి పట్టింది. వైద్య సిబ్బంది కూడా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు చెబుతున్నారు. ఇంత వరకు బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – రాప్తాడు:



పాలచెర్ల గ్రామంలో సీసీ రోడ్డు పక్కనే నిలిచిన మురుగు

### ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యంపై అట్రాసిటీ కేసు

**అనంతపురం:** నగరంలోని రాం నగర్ ఫ్లైఓవర్‌కు ఆనుకుని ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యంపై అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఆసుపత్రి నిర్వాహకులు ముత్యాలన్న, మనోరంజన్ రెడ్డికి అనస్తీషియా డాక్టర్ స్వర్ణలత రెండు సంవత్సరాల క్రితం రూ.90 లక్షలను ఆసుపత్రి నిర్వాహణ నిమిత్తం చెల్లించారు. ఇదే ఆసుపత్రిలో స్వర్ణలతకు వాటా ఉంది. అయితే వారి మధ్య వాటాల పంపకాల్లో కొంత కాలంగా విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో డాక్టర్ స్వర్ణలత మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయించారు. మానవ హక్కుల ఆదేశాలతో నగర పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు డీఎస్పీ ఆధ్వర్యంలో దర్యాప్తు సాగుతోంది. ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యంపై డాక్టర్ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది.

### ముగిసిన దశమ బ్రహ్మోత్సవాలు



చక్రస్నానంలో పాల్గొన్న ఆలయ ధర్మకర్తలు

**అనంతపురం కల్చరల్:** గత మూడు రోజులుగా కొనసాగిన తపోవనం శ్రీక్షేత్రం దశమ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఆలయ నిర్వాహకుడు, మాజీ ప్రభుత్వ సలహాదారుడు (ఎండోమెంటు) జ్వాలాపురం శ్రీకాంత్ నేతృత్వంలో ఉదయం ధ్వజారోహణం, వసంతోత్సవం, నిరాటోత్సవంతో పాటూ ద్వాదశ కలశారాధన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ముగింపు వేడుకలకు ప్రతీకగా సాగే చక్రస్నానంలో ఆలయ ధర్మకర్తలు, భక్త మండలుల ప్రతినిధులు, భక్తబృందాలు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీమహావిష్ణు తీర్థాలతో వసంతోత్సవం జరుపుకున్నారు. ఆలయంలో కొలువుదీరిన లక్ష్మీ వేంకటేశ్వరుడు, గోదా రంగనాథులు, లక్ష్మీహయగ్రీవులకు పూజలు చేశారు. అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ధర్మవరం విజయకుమార్, వెంకటనారాయణ అయ్యంగార్, రఘునాథ్, భరద్వాజ్, శైలజ, శ్రీమతి, హరిప్రియ పాల్గొన్నారు.

### అయ్యప్ప ఆలయానికి విరాళం

**కనగానపల్లి:** మండల కేంద్రంలో నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయ అభివృద్ధికి దాత దాసరి చిన్న ఓబిలేసు కుమారుడు దాసరి నాగరాజు శుక్రవారం రూ.1.7 లక్షలను విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను ప్రత్యేకంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధికి ఆర్థికసాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దాతలు, భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశామని కమిటీ సభ్యులు తెలిపారు.

## విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

**అనంతపురం ఎడ్యుకేషన్:** సంపద సృష్టి అంటే పదో తరగతి విద్యార్థులను ఫెయిల్ చేయడమేనా? అని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్ మండిపడ్డారు. పదో తరగతి మార్కుల ఆధారంగా నిర్వహించే అడ్మిషన్ ప్రక్రియకు గడువు పెంచాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రీ వెరిఫికేషన్, రీకౌంటింగ్‌కు డబ్బు చెల్లించిన విద్యార్థులకు తిరిగి డబ్బు చెల్లించాలన్నారు. కూటమి ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యమవుతోందన్నారు. వారంలోనే పదో తరగతి ఫలితాలను వెల్లడించాం అని ఘనంగా చెప్పుకునేందుకు ప్రభుత్వం పెద్ద తప్పిదం చేసిందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తప్పులు చేసిన చరిత్ర ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు మంజునాథ్ రెడ్డి, వెంకట్ మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలో విద్యావ్యవస్థకి ఒక పెద్ద మచ్చగా పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం మారిందన్నారు. తప్పిదాలకు మంత్రి లోకేష్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి నితిన్, నిశాంత్ రెడ్డి, మహేష్ నాయక్, కై లాస్, రాహుల్ రెడ్డి, షౌకత్ అలీ, ఫయాజ్, వడ్డే ప్రశాంత్, సాయి రెడ్డి,శేఖర్, వంశీ నాయుడు, అశోక్ పాల్గొన్నారు.

## కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు



మాట్లాడుతున్న ఎంపీపీ సుబ్బర హేమలత

**ఆత్మకూరు:** రామగిరి మండలంలో దళిత వర్గానికి చెందిన ఓ బాలికపై ఆరు నెలలుగా 14 మంది దుర్మార్గులు మూకుమ్మడిగా అత్యాచారానికి పాల్పడటం దుర్మార్గం. ఇంతటి నీచానికి ఒడిగట్టిన వారిని కఠినంగా శిక్షించాలని ఎంపీపీ సుబ్బర హేమలత డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ చాంబర్‌లో మాజీ రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పార్వతమ్మ, ఆత్మకూరు సర్పంచ్ ఎగ్గిడి వరలక్ష్మితో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని మండిపడ్డారు. ఇటీవల ఆత్మకూరు మండలం బి.యాలేరులో మహిళల ఇళ్లలోకి దూరి చెప్పులతో కొట్టారని, మరో సారి నడి రోడ్డు మీదనే జుట్టు కత్తిరించారని తెలిపారు. ఏడుగుర్రాల పల్లిలో స్కూల్‌కు వెళ్లే మైనర్ బాలికను ఆరు నెలలుగా 14 మంది టీడీపీ పార్టీకి చెందిన వారు అత్యాచారం చేస్తూ వీడియోలూ తీసి బ్లాక్ మెయిల్ చేస్తూ అత్యాచారానికి పాల్పడ్డారని తెలిపారు. నిందితులను వెంటనే శిక్షించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**అనంతపురం టవర్‌క్లాక్:** మైనర్ బాలికపై అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ కొడవండ్ల డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నోరు విప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చంద్రచర్ల హరి, పులి క్రిష్ణ, శంకర్, వేమన్న తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తోపుదుర్తి జన్మదిన వేడుకలు



రాప్తాడులో చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆత్మకూరులో సంబరాలు చేసుకుంటున్న నాయకులు

**రాప్తాడు:** మండల కేంద్రంలో శుక్రవారం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. తొలుత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాప్తాడులో వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మండల కన్వీనర్ సాకే వెంకటేష్, యూత్ మండల కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి, మాజీ మండల యూత్ కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో 200 కేజీల కేక్‌ను చిన్నారులతో కట్ చేయించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నివాసానికి చేరుకుని పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

**ఆత్మకూరులో..**

**ఆత్మకూరు:** మండల వ్యాప్తంగా శుక్రవారం మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఆత్మకూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రకాష్‌రెడ్డి పేరూరు డ్యాంకు నీరు తీసుకువచ్చి అన్నదాతల కళ్లలో ఆనందం చూశారన్నారు. పేదలకు ఇళ్లు నిర్మించి అండగా నిలిచారన్నారు. అలాగే బి.యాలేరులో మాజీ ఎంపీపీ శంకర నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ బాలపోతన్న, ఎంపీపీ హేమలత, వైస్ ఎంపీపీ విజయ్, సర్పంచ్ ఎగ్గిడి వరలక్ష్మి, మాజీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కరుబ పార్వతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు వాసుదేవరెడ్డి, బాలస్వామి రెడ్డి, వెంకట్రాముడు, ఫణిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వన్నూరప్ప, అతిక్ రెడ్డి, నాగభూషణం రెడ్డి, రాజశేఖర్, ఓబీ టైలర్ వెంకటేష్, ఆంజనేయులు, సురేష్, నరేష్, గంగాధర్, శ్రీరామ్, వెంకట్రామిరెడ్డి, మహేష్, నాగరాజు, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

**అనాథాశ్రమంలో 'తోపుదుర్తి' జన్మదినం**

**రాప్తాడురూరల్:** అనంతపురం రూరల్ ఎస్కేయూ సమీపంలోని అమ్మ బడి అనాథ ఆశ్రమంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు జరుపుకొన్నారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి జి. లింగారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అనాథలకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేంద్రరెడ్డి, వలంటీర్ విభాగం శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, సోషల్ మీడియా మన్‌ప్రీత్ రెడ్డి, టీకులపల్లి రమేష్, శివ పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

**అనంతపురం కల్చరల్:** ఆధ్యాత్మిక చింతన మానసిక ప్రశాంతత లభిస్తుంది. అందరూ భక్తిమార్గంలో నడవాలని గవిమఠం పీఠాధిపతి కరిబసవ రాజేంద్ర మహాస్వామి తెలిపారు. శుక్రవారం స్థానిక అరవింద నగర్‌లోని సర్వేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు గురుమూర్తి స్వామి నేతృత్వంలో కల్యాణంలోని అన్ని ఘట్టాలు సంప్రదాయసిద్ధంగా సాగాయి. గవిమఠం పీఠాధిపతి కరిబసవ రాజేంద్ర మహాస్వామి విశిష్ట అతిథిగా విచ్చేసి భక్తులకు అనుగ్రహ బాషణం చేశారు. స్వయంగా శివపార్వతుల కల్యాణాన్ని జరిపించారు. ఈ సందర్భంగా ఆయన భక్తిమార్గంపై మాట్లాడుతూ.. ఉత్తమ విలువలతో కూడిన జీవన విధానాన్ని పెద్దలు నిర్దేశించారన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం, తీర్థప్రసాద వినియోగం జరిగాయి. సాయంత్రం నగరవీధుల్లో ఉత్సవమూర్తులను ఊరేగించారు. శివనామస్మరణతో వీధులు మార్మోగాయి. సంప్రదాయ గొరవయ్యల నృత్యం, జంగమయ్యల శివకళారూపాల ప్రదర్శన ఆకట్టుకుంది. వివిధ దేవతామూర్తుల వేషధారణల్లో దీపం పట్టుకున్న అమ్మవారిగా కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

## బక్రీద్‌కు ముస్తాబు



ప్రార్థనలకు సిద్ధమైన ఈద్గా మసీదు

**అనంతపురం కల్చరల్:** దైవ ప్రవక్త హజరత్ ఇబ్రహీం (స) త్యాగనిరతికి ప్రతిరూపంగా ముస్లింలు జరుపుకునే బక్రీదు పర్వదినం కోసం నగరమంతటా ఏర్పాట్లు పూర్తయ్యాయి. మేయర్ వసీం, మునిసిపల్ అధికారులు ఈద్గా మైదానాల్లో వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నారు. నగరంలోని చాందినీ మసీదు, ఈద్గా మసీదు, జామియా, మదీనా, గుల్జార్‌పేట తదితర మసీదులతో పాటూ ప్రధాన ప్రార్థనా స్థలాలైన డ్రైవర్స్ కాలనీ షాహీ ఈద్గా, పిల్లిగుంట్ల కాలనీ ఈద్గా, హెచ్చెల్సీ కాలనీ సమీపంలోని బహద్దీన్ ఈద్గా తదితర చోట్ల బక్రీదు సామూహిక ప్రార్థనలు జరుగుతాయి. బహవుద్దీన్ ఈద్గా వద్ద 9 గంటలకు, డ్రైవర్స్ కాలనీ ఈద్గాలో 9.30 గంటలకు సామూహిక ప్రార్థనలు జరుగుతాయని ప్రార్థనా మందిరాల ముతవల్లీలు తెలిపారు.

### ఇబ్రహీం త్యాగం గుర్తు చేసుకోవాలి



అల్లాహ్‌ను మెప్పించిన మహోన్నత వ్యక్తి ఇబ్రహీం త్యాగాన్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరం చాలా ఉంది. కన్నకొడుకునే దైవాజ్ఞ కోసం సమర్పణ చేయడానికి సిద్ధపడటం గొప్ప విషయం. స్వార్థాన్ని వీడి సమాజాన్ని అర్థం చేసుకుంటేనే ఎవరైనా ప్రశాంతంగా ఉండగలుగుతాం. పండుగలనేవి భక్తిమార్గాన్ని పెంచడం కోసమే కాదు.. జీవన విధానాన్ని తెలియజేసే సాధనాలుగా ఉంటాయి. బక్రీద్ పర్వదినం అందరిలో ఐక్యత, ప్రశాంతతను తేవాలని కోరుకుందాం.

– హజ్రత్ హాఫీజ్ ఖారీ మౌలానా, తారా మసీదు

### వినాయక విగ్రహ ప్రతిష్ఠ

**అనంతపురం కల్చరల్:** నగరంలోని లలిత కళాపరిషత్తు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన సిద్ధి వినాయక ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం కనుల పండువగా సాగింది. ఉదయం సత్యనారాయణ శర్మ నేతృత్వంలో పలువురు వేదపండితులు మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, వాస్తు హోమం, ప్రాణప్రతిష్ఠలను శాస్త్రోక్తంగా జరిపించారు. వివిధ పుష్పాలతో పాటూ మోదుకలతో అలంకార సేవలు నిర్వహించారు. వందల సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎల్కేపీ కార్యదర్శి పద్మజ, కార్యవర్గ సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

### 'పెట్టుబడి సాయం ఇవ్వాల్సిందే'

**అనంతపురం అర్బన్:** అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం రూ.20 వేలు తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 90 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించాలన్నారు. రైతులను ఆదుకోవాలనే డిమాండ్లతో ఈనెల 9వ తేదీన జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా తలపెట్టామన్నారు. రైతులను ఆదుకోవడంలో, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు తక్షణం రైతులకు అందించాలన్నారు. కౌలు రైతులకూ అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. 90 శాతం సబ్సిడీతో ఐదు ఎకరాలకు సరిపడా విత్తనాలు ఇవ్వాలన్నారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. సాగు ఖర్చులు అధికమవుతున్నందున స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్ ఎకరాకు రూ.50 వేలు ప్రకారం బ్యాంకులు పంట రుణాలు ఇవ్వాలన్నారు. బంగారు పంట రుణాలకు వడ్డీ మాత్రమే కట్టించుకుని రెన్యూవల్ చేయాలన్నారు. రైతులందికీ పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు.

### త్రివిధ దళాల పతాక నిధికి విరాళం

**అనంతపురం:** ఆపరేషన్ సిందూర్ విజయస్ఫూర్తితో భారత ఆర్మీ త్రివిధ దళాల పతాక నిధికి హరిశ్చంద్ర ఘాట్ అధ్యక్షుడు తిరువీధుల జగదీష్, ట్రెజరర్ డి.సాయినాథ్ గుప్తా విరాళం అందజేశారు. శుక్రవారం జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్పకు రూ.1,01,116 విరాళాన్ని చెక్కు రూపంలో ఇచ్చారు. దాతలు అనంతపురం కోవూరు నగర్ మూడో క్రాస్‌లో ఉన్న జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని పి. తిమ్మప్ప కోరారు. జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ అనంతపురం, ఎస్‌బీఐ సుభాష్ రోడ్డు బ్రాంచ్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 62076956433, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్0021438కు ఆన్‌లైన్‌లో తమ విరాళాలు అందించాలన్నారు. వివరాలకు 08554-24116 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

### బైక్ అదుపు తప్పి మహిళ మృతి

**వెల్దుర్తి:** వారిద్దరూ వరుసకు అక్కాచెల్లెళ్లు. బంధువుల ఊరిలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనేందుకు బైక్‌పై బయలుదేరారు. మార్గ మధ్యలో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరో మహిళ తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన దుర్గ, వైష్ణవి (30) దగ్గరి బంధువులు. వరసకు అక్కాచెల్లెళ్లు అవుతారు. నంద్యాల జిల్లా వెలుగోడు మండలం రేగడగూడూరు గ్రామంలో జరుగుతున్న వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొనేందుకు శుక్రవారం బయలుదేరారు. వైష్ణవి ఆటో డ్రైవర్ కావడంతో బైక్‌పై బయలుదేరారు. బెంగళూరు-కర్నూలు జాతీయ రహదారి మీదుగా ప్రయాణించి వెల్దుర్తి నుంచి నంద్యాల హైవే మీదుగా రేగడగూడూరు వెళ్లాలని భావించారు. ఈ ప్రయత్నంలో వెల్దుర్తి పట్టణం దాటిన తర్వాత నక్కల తిప్ప వద్ద బైక్ అదుపుతప్పడంతో కింద పడ్డారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వైష్ణవి అక్కడికక్కడే మృతి చెందింది. దుర్గకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వెల్దుర్తి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. మృతదేహాన్ని, గాయపడిన మహిళను స్థానిక సీహెచ్‌సీకి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతురాలు వైష్ణవి అనంతపురానికి చెందిన రామాంజనేయులు కుమార్తె. ఈమెకు ఇంకా పెళ్లి కాలేదు. గాయపడిన దుర్గ గృహిణి, ఈమెకు భర్త శివకుమార్ ఉన్నారు.

### భక్తిశ్రద్ధలతో అఖండ గాయత్రీ హోమం



గాయత్రీ హోమం చేస్తున్న దృశ్యం

**అనంతపురం కల్చరల్:** వేదమాత గాయత్రీ దేవి జయంతిని పురస్కరించుకుని స్థానిక అశోక్ నగర్‌లోని హరిహర దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్విరామ గాయత్రీ హోమం నిర్వహించారు. మూడు వందల మంది భక్తులు వేర్వేరు చోట్ల ఏర్పాటు చేసిన హోమ గుండాల వద్ద పవిత్ర గాయత్రీ మంత్రం జపిస్తూ నెయ్యితో హోమం చేశారు.